
సాక్షి
వికారాబాద్
ఆదివారం । 16 । ఏప్రిల్ । 2023


స్వామివారి రథం వద్ద కలశపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు



రంజాన్ వేళలు


ఇరువర్గాలను అదుపు చేస్తున్న పోలీసులు

కనుల పండువగా రథోత్సవం

భావిగి భద్రేశ్వరాలయ బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం శనివారం రాత్రి కనుల పండువగా కొనసాగింది. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు స్వామివారి కలశంతో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ దీప, నాయకులు రాజుగౌడ్, రమేశ్‌మహరాజ్, మురళీకృష్ణ, రమేశ్, సంపత్, ఉత్సవ నిర్వాహకులు శ్రీశైలం, సుధాకర్, రాజశేఖర్, సంపత్‌కుమార్, భద్రేశ్వర్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రథోత్సవం సమయంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మద్దతుదారుల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు.

– తాండూరు


రథం ఎదుట భక్తుల కోలాహలం

న్యూస్‌రీల్

నేడు గురుకుల విద్యాలయ ప్రవేశ పరీక్ష

కొడంగల్: తెలంగాణ గిరిజన గురుకుల విద్యాలయాల్లో ఖాళీ సీట్ల భర్తీ కోసం ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బలరాం తెలిపారు. ఆరో తరగతిలో అడ్మిషన్ పొందాలనుకునే విద్యార్థులకు ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. పాత కొడంగల్‌లోని గిరిజన గురుకులంలో సెంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. హాల్ టికెట్, పరీక్ష ప్యాడ్, పెన్ను, వాటర్ బాటిల్‌తో రావాలని సూచించారు.

అగ్ని ప్రమాదాలపై మాక్ డ్రిల్


తాండూరులో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఫైర్ సిబ్బంది

తాండూరు టౌన్: అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాండూరు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నాగార్జున అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని శ్రీలక్ష్మిమహల్ థియేటర్‌లో మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రమాదం సంభవించినప్పుడు చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. థియేటర్‌లోని ఫైర్ సేఫ్టీ పరికరాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందన్నారు. థియేటర్లలో బీడీ, సిగరెట్ తాగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పూరి గుడిసెలు, గడ్డి వాముల వద్ద నిప్పు రవ్వలు ఎగిసి పడకుండా చూసుకోవాలని వివరించారు. ప్రమాదం సంభవించిన వెంటనే 101కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది గోపాల్, ఖాజా, శ్రీనివాస్, అమర్‌నాథ్‌రెడ్డి, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని దివ్యాంగుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలిత కుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇంటర్ ఆపై చదివిన దివ్యాంగ విద్యార్థులు ఈనెల 25వ తేదీ లోపు htt pr://tsobmmr.cff.gov.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయా విభాగాల్లో 135 పరికరాలు మంజూరైనట్లు తెలిపారు. వివరాలకు ఫోన్:7396908597లో సంప్రదించాలని పేర్కొన్నారు.

28నుంచి సమ్మె చేస్తాం


తాండూరు ఎంపీడీఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్యదర్శులు

తాండూరు రూరల్: ప్రభుత్వం స్పందించి వెంటనే తమను రెగ్యులరైజ్ చేయాలని తాండూరు మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి, ఎంపీఓ రతన్‌సింగ్‌కు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ.. తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ ఫెడరేషన్(టీపీఎస్‌ఎఫ్) ఆదేశాల మేరకు ఈ నెల 28నుంచి సమ్మెలో పాల్గొననున్నట్లు స్పష్టంచేశారు. ఈ నెల 11న ప్రొబేషన్ గడువు ముగిసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో తమ ఉద్యోగాల క్రమబద్ధీకరణకు జీఓ తీసుకురావాలని కోరారు. నాలుగేళ్ల ప్రొబేషన్ కాలాన్ని సర్వీస్‌గా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తక్కువ వేతనంతో పనిచేస్తున్నామని, క్రమబద్ధీకరణ ఆశతో ఎన్ని అవకాశాలు వచ్చినా అన్నింటినీ వదులుకుని పనిచేస్తున్నామని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు జేపీఎస్‌లుగా ప్రమోషన్ కల్పించాలని కోరారు. గ్రామ స్థాయిలో ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా ప్రజల్లోకి తీసుకెళ్తున్న తమ సమస్యలను పరిష్కరించాలన్నారు.

రూ. 10వేలు కట్టు.. 24/7 కొట్టు!

ఇప్పటివరకు అత్యవసర సేవలు అందించే ఆస్పత్రులు, మెడికల్ షాపులు, అనుమతి పొందిన పెట్రోల్ బంకులకే నిరంతరాయం తెరిచి ఉంచే వెసులుబాటు ఉండగా.. ప్రభుత్వం ఇక నుంచి అన్ని దుకాణాలకు ఈ అవకాశం కల్పించింది.

- నిరంతర షాపుల నిర్వహణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- జీఓ నంబర్ 4 ద్వారా వ్యాపారులకు వెసులుబాటు
- జిల్లాలో 2,700 దుకాణాలు
- ప్రభుత్వ జీఓపై వ్యాపారుల్లో మిశ్రమ స్పందన

తాండూరు: వ్యాపార లావాదేవీలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇక నుంచి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని దుకాణాలను నిరంతరాయం (24/7) తెరిచి ఉంచేలా జీఓ ఎంఎస్ నంబర్ 4ను జారీ చేసింది. ఇందులో అన్ని దుకాణాలకు అనుమతులు కల్పిస్తున్నట్లు పేర్కొంది. ఇందుకోసం ఒక్కో షాపు నిర్వాహకుడు ఏటా రూ.10 వేలు కార్మిక శాఖకు చెల్లించాల్సి ఉంటుంది. దీనికి తోడు వ్యాపారులు విధిగా లేబర్ కమిషన్ నిబంధనలు పాటించాలి. జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు, ఇరవై మండలాలు ఉన్నాయి. వీటిలో తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్‌లో వ్యాపార లావాదేవీలు ఎక్కువగా కొనసాగుతాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,700 దుకాణాలు ఉన్నాయి. ఇప్పటి వరకు రాత్రి 11 గంటలు దాటితే వీటికి తాళం పడుతోంది. శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా గస్తీ నిర్వహించే పోలీసులు 11 గంటలలోపు షాపులను మూసేయిస్తున్నారు. ఆతర్వాత కూడా ఎవరైనా దుకాణాలు తెరిచి ఉన్నట్లు గమనిస్తే.. బంద్ చేయించిన తర్వాతే అక్కడినుంచి వెళ్తున్నారు. అయితే కార్మిక శాఖ, లేబర్ ఎంప్లాయ్‌మెంట్ ట్రయినింగ్ అండ్ ఫ్యాక్టరీస్ శాఖల చట్టం 20 ఆఫ్ 1988 ప్రకారం 24/7 వ్యాపారాలు చేసుకునే వెసులుబాటు కల్పించింది. పర్మిషన్ పొందిన దుకాణదారులకు మాత్రమే ఈ అవకాశం ఉంటుంది. అలా కాకుండా ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే కార్మిక శాఖ అధికారులు భారీ జరిమానాలు విధిస్తారు.


తాండూరు పట్టణంలోని దుకాణాలు

కార్మిక సంక్షేమంపై దృష్టి

ఎల్లప్పుడూ దుకాణాలు తెరిచి ఉంచే సమయంలో కార్మిక సంక్షేమాన్ని సైతం పాటించాలని కార్మిక శాఖ పేర్కొంటోంది. 24/7 కేటగిరీ కింద బిజినెస్ చేసే వారు కార్మికుల పని వేళలను విధిగా పాటించాలి. సెలవు దినాల్లో పని చేసే వారికి అదనపు వేతనం చెల్లించాలని ఉత్తర్వుల్లో సూచించింది. రాత్రి వేళల్లో పని చేసే మహిళా కార్మికుల భద్రతను సైతం పరిగణనలోకి తీసుకోనుంది.

వ్యాపార కేంద్రంగా తాండూరు..

జిల్లాలోనే ప్రధాన వాణిజ్య కేంద్రంగా కొనసాగుతోంది తాండూరు. జీఓ నంబర్ 4 ద్వారా ఈ ప్రాంతంలోని వ్యాపారులకు కలిసొచ్చింది. కార్మికశాఖ అధికారుల లెక్కల ప్రకారం నియోజకవర్గంలో 1,200 దుకాణాలు ఉన్నాయి. మరోవైపు నాపరాతి గనులు, సిమెంట్ కర్మాగారాలు, నాపరాతి పాలిషింగ్ యూనిట్లు కొనసాగుతున్నాయి. ఇక్కడ నిత్యం రూ.కోట్లలో వ్యాపారం జరుగుతుంది. రాత్రి సమయంలో దుకాణాలను తెరిచి ఉంచే అవకాశం కల్పిస్తే వీరికి లాభసాటిగా ఉంటుంది. కానీ రాత్రి వేళల్లో వ్యాపారం చేయడం వలన సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని కొంతమంది వ్యాపారులు పేర్కొంటున్నారు.

వీటిపై స్పష్టత కరువు

వ్యాపారం నిమిత్తం 24 గంటల పాటు దుకాణాలు తెరిచి పెట్టేందుకు ప్రభుత్వం జీఓ జారీ చేసింది. అయితే కల్లు, మద్యం విక్రయాలపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. జిల్లాలో 60కి పైగా మద్యం దుకాణాలు కొనసాగుతున్నాయి. మరోవైపు వందల సంఖ్యలో కల్లు దుకాణాలు ఉన్నాయి. బార్ అండ్ రెస్టారెంట్లు, హోటళ్ల నిర్వహణలోనూ క్లారిటీ లేదు. మద్యం దుకాణాలకు 24/7 అవకాశం ఉందా..? లేదా..? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

ఉత్తర్వులు అందలేదు



దుకాణాలను 24/7 నిర్వహించేందుకు ప్రభుత్వం జీఓ జారీ చేసింది. ఇందుకు అనుగుణంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శాంతిభద్రతలను పర్యవేక్షిస్తాం. రాత్రి సమయంలో దుకాణాల కొనసాగింపుపై మాకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సబ్ డివిజన్ పరిధిలో భద్రతా చర్యలు చేపడుతాం.

– శేఖర్‌గౌడ్, డీఎస్పీ, తాండూరు

వైన్స్‌కు వర్తించదు



దుకాణాలను 24/7 తెరిచి ఉంచేందుకు ప్రభుత్వం జీఓ నంబర్ 4ను జారీ చేసింది. అయితే ఎక్సైజ్ శాఖ ఆధీనంలో కొనసాగుతున్న మద్యం, కల్లు దుకాణాలకు ఈ జీఓ వర్తించదు. ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారమే బార్ అండ్ రెస్టారెంట్లు కొనసాగుతాయి. మద్యం దుకాణాలు తెరిచి ఉంటాయనే ప్రచారంలో నిజం లేదు.

– అనంతయ్య, ఎక్సైజ్ సీఐ



ధాన్యం సేకరణకు కసరత్తు

- జిల్లాలో 90వేల ఎకరాలకు పెరిగిన వరిసాగు
- దిగుబడి అంచనా.. 1.75 లక్షల మెట్రిక్ టన్నులు
- 123 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం
- నెలాఖరు వరకు ప్రారంభించేలా యంత్రాంగం అడుగులు

వికారాబాద్: యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యం సేకరణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఈ అంశం నలుగుతూ వచ్చేది. కానీ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ఎలాంటి ఎదురుచూపులు లేకుండానే అన్నదాతకు ఊరట లభించినట్లయింది. ఇదిలా ఉండగా మిగిలిన జిల్లాలతో పోలిస్తే మన జిల్లాలో సుమారు 15నుంచి 20 రోజులు ఆలస్యంగా నాట్లు వేస్తారు. కొంతమంది రైతులు నెల క్రితం వరకూ నాట్లు వేశారు. మిగిలిన ప్రాంతాలతో పాటే ఇక్కడ సైతం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి యంత్రాంగం కసరత్తు చేస్తోంది. అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ ఇటీవలే సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు.

123 కొనుగోలు కేంద్రాలు..

గతంలో జిల్లా వ్యాప్తంగా 167 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఈసారి వీటిని 123కు కుదించారు. ఈనెలాఖరు వరకు కొనుగోళ్లు ప్రారంభమయ్యేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో జిల్లావ్యాప్తంగా సుమారు 60వేల ఎకరాలోవరి సాగవగా.. ప్రస్తుత సీజన్‌లో 90 వేల ఎకరాలకు పెరిగింది. ఎకరానికి సగటున 20 క్వింటాళ్ల దిగబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఈ లెక్కన 1.75 లక్షల మెట్రిక్ టన్నుల పంట దిగుబడి రావచ్చని అధికారులు భావిస్తున్నారు. చివరి గింజ వరకు కొనుగోలు కేంద్రాలు కొనసాగేలా ఏర్పాట్లు చేయనున్నారు.

గత అనుభవాల నేపథ్యంలో..

గత యాసంగిలో కొనుగోలు కేంద్రాల నిర్వహణలో తలెత్తిన అనుభవాల నేపథ్యంలో ఈసారి ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టిసారించారు. గతేడాది యాసంగిలో సెర్ప్, మార్కెట్ కమిటీలు, పీఏసీఎస్, డీసీఎమ్మెస్‌ల ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో ఎక్కువ శాతం ధాన్యాన్ని సెర్ప్ ద్వారా సేకరించారు. సెర్ప్(గ్రామైక్య సంఘాల) ఆధ్వర్యంలో 52 సెంటర్లు ఏర్పాటు చేయగా.. వీరు పర్యాయాల పాటు పెద్దగా ఆసక్తి చూపలేదు. గత యాసంగి కొనుగోలు సమయంలో బ్యాగుకు 1,200 గ్రాముల తరుగు తీయగా.. మిల్లర్లు 5నుంచి 7కిలోలు కట్ చేశారు. ఈవిషయంలో సెర్ప్ సిబ్బంది, గ్రామైక్య సంఘాల మహిళలు.. అటు రైతులకు ఇటు మిల్లర్లకు సమాధానం చెప్పలేక ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో పలు సెంటర్ల నిర్వాహకులు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు నష్టపోయారు. ఈనేపథ్యంలో కొనుగోల కేంద్రాల ఏర్పాటుకు వీరు ముందుకు రావడం లేదు. ఆసక్తి ఉన్న వారికి అవకాశం ఇచ్చి.. మిగితా చోట్ల పీఏసీఎస్‌లు, మార్కెట్ కమిటీలు, డీసీఎమ్మెస్‌ల ద్వారా కొనుగోళ్లు చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు. గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు అవసరమైన మేరకు ముందుగానే కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

పక్కాగా ఏర్పాట్లు

గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నాం. తాలు, తరుగు, తేమ, మట్టి పెల్లల శాతం ఎంత ఉండాలనే అంశంలో నిర్వాహకులకు తరగతులు నిర్వహిస్తాం. సెంటర్లకు ధాన్యం తెచ్చే రైతులు తూర్పారపట్టి తీసుకు రావాలి.

– రాహుల్‌శర్మ, అడిషనల్ కలెక్టర్

'నిరుద్యోగ నిర్మూలన'కు మద్దతివ్వండి

- ఈకో ఫాన్ ఫౌండర్ సాయి సంపత్ ప్రతిపాదన
- గవర్నర్ తమిళిసైతో భేటీ

బషీరాబాద్: దేశం, ఉపాధి హామీ పథకంలో భాగంగా రాష్ట్రం, దేశంలో నిరుద్యోగ నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలను వివరిస్తూ తాను ఓ ప్రాజెక్టును రూపొందించానని ఈకో ఫాన్ ఫౌండర్ సాయి సంపత్ గవర్నర్ తమిళి సై సౌందరరాజన్‌కు విన్నవించారు. దీని నివేదికను ఇప్పటికే పీఎంఓకు పంపించానని, మీరు కూడా ప్రధానికి పంపించాలని గవర్నర్‌ను కోరారు. బషీరాబాద్ మండలం బాద్లాపూర్‌కు చెందిన సంపత్ గత నెల జెనీవాలో జరిగిన ఐరాస మీట్‌లో భారత్ తరపున పాల్గొన్న విషయం తెలిసిందే. ఈ సమావేశంలో దళితుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రస్తావించి అంతర్జాతీయ ప్రతినిధులను మెప్పించారు. ఈ నేపథ్యంలో గవర్నర్ తమిళి సై శనివారం సాయి సంపత్‌ను రాజ్‌భవన్‌కు పిలిపించి అరగంట సేపు మాట్లాడారు. చిన్న వయసులోనే దేశం తరపున అంతర్జాతీయ వేదికపై మాట్లాడటం గర్వకారణమని అభినందించారు. అనంతరం సంపత్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాల్సిన ఆవశ్యకత, దాని ప్రతిఫలాలను తన ప్రాజెక్టులో పొందుపరిచినట్లు తెలిపారు. ఈ నివేదిక కేంద్రానికి చేరేలా చూడాలని కోరడంపై గవర్నర్ సానుకూలంగా స్పందించారని చెప్పారు. సంపత్ వెంట తండ్రి లక్ష్మయ్య, సోదరుడు శివభూషన్ ఉన్నారు.


గవర్నర్ తమిళిసైకి ప్రాజెక్టు రిపోర్టు అందిస్తున్న సాయి సంపత్

బ్యారక్‌ల నిర్మాణానికి స్థల పరిశీలన

అనంతగిరి: వికారాబాద్‌లోని పోలీస్ శిక్షణ కేంద్రంలో కొత్త బ్యారక్‌ల నిర్మాణానికి ఎస్పీ కోటిరెడ్డి శనివారం సాయంత్రం స్థల పరిశీలన చేశారు. ట్రైనింగ్ సెంటర్‌లోని గ్రౌండ్ పాటు వసతి, తరగతి గదులను పరిశీలించారు. ఇతర జిల్లాలకు చెందిన సుమారు 360 మంది అభ్యర్థులు ఇక్కడ పోలీస్ శిక్షణ తీసుకుంటున్నారని తెలిపారు. వీరికోసం ప్రస్తుత బ్యారక్‌లతో పాటు మరిన్ని అవసరం ఉన్న నేపథ్యంలో కొత్త వాటి నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని స్పష్టంచేశారు.


పోలీస్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

సర్వ మతాలకు సమ ప్రాధాన్యం


రంజాన్‌గిఫ్టులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, చైర్‌పర్సన్, ఎంపీపీ

- రంజాన్‌ను సంతోషంగా జరుపుకోవాలి
- ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్
- వికారాబాద్‌లో పండుగ కానుకల పంపిణీ
- నేలపై కూర్చుని నిరసన తెలిపిన మహిళా నేతలు

వికారాబాద్ అర్బన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని మతాలకు సమ ప్రాధాన్యం ఇస్తోందని వికారాబాద్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆనంద్ అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, ఎంపీపీ చంద్రకళతో కలిసి శనివారం పట్టణంలోని క్లబ్ ఫంక్షన్ హాల్‌లో ముస్లింలకు రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం కేసీఆర్ అన్ని మతాల పండులకు సముచిత గౌరవం కల్పిస్తున్నారన్నారు. పేద ముస్లింలు పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతోనే ఉచితంగా కానుకలు అందజేస్తున్నారని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, నాయకులు తస్వర్ అలీ, ఎర్రవల్లి జాఫర్ పాల్గొన్నారు.


నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న చైర్‌పర్సన్

ప్రొటోకాల్ రగడ

రంజాన్ కానుకల పంపిణీలో ప్రొటోకాల్ రగడ నెలకొంది. అధికారుల తీరును నిరసిస్తూ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, ఎంపీపీ చంద్రకళ, వైస్ చైర్‌పర్సన్ శంషాద్‌బేగం, స్థానిక కౌన్సిలర్ ఫైముదాబేగం నేలపై కూర్చుని ఆందోళన వ్యక్తంచేశారు. ఫంక్షన్ హాల్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో తమ ఫొటోలు ఎందుకు లేవని..? తహసీల్దార్ వహీదాఖాతుమ్‌ను నిలదీశారు. సీఎం, మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి తమను అవమానించారని అసహనం వ్యక్తంచేశారు. ఈ విషయమై అక్కడే ఉన్న ఎమ్మెల్యే ఆనంద్‌ను అడగగా ఆయన స్పందించలేదు. ఫ్లెక్సీలను తొలగిస్తేనే వేదిక వద్దకు వస్తామని చెప్పడంతో అధికారులు ఫ్లెక్సీలను తొలగించారు. ప్రొటో కాల్ పాటించకుండా తమను అవమానించిన వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

క్లుప్తంగా

ఆందోళన ఉధృతం చేస్తాం

మండల సాధన కమిటీ సభ్యుడు శంకర్



రిలే దీక్షలో సాధన కమిటీ నాయకులు, గ్రామస్తులు

పెద్దేముల్: తట్టెపల్లిని మండలం చేసేవరకు ఆందోళనను ఉధృతం చేస్తామని సాధన కమిటీ సభ్యులు శంకర్, గోపాల్ అన్నారు. సాధన కమిటీ రిలే దీక్షలు శనివారం నాటికి 9వ రోజుకు చేరుకున్నాయి. తట్టెపల్లి చుట్టు పక్కన ఉన్న తండాలు, గ్రామాల్లో కనీస వసతులు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి హామీ ఇచ్చే విధంగా చుడాలని విజ్ఞప్తి చేశారు. అడ్కిచెర్ల, ఓంలానాయక్‌తండా, పాషాపూర్, జైరాంతండా, రచ్చకట్టతండా తదితర గ్రామాల్లో కనీస వసతులు లేకపోవడంతో గిరిజనులు కర్ణాటక ప్రాంతానికి వెళ్తున్నారని అన్నారు. కనీసం ఆయా గ్రామాలకు రోడ్లు కూడా సక్రమంగా లేవన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ ప్రభుకుమార్, బీఆర్ఎస్ నాయకులు మైబుబ్, హజీ పటేల్, హబీబ్, పండరి, సలీమ్, రవి, ముబారక్, సాజిద్, నజీర్, కలీల్, రామప్ప, చంద్రప్పతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవన్‌నాయక్



మాట్లాడుతున్న రాఘవన్‌నాయక్

అనంతగిరి: రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవన్‌నాయక్ అన్నారు. ఈమేరకు శనివారం వికారాబాద్ మండలం సిద్దులూర్‌లో బూత్ స్వశక్తికరణ్ అభియాన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తున్నామన్నారు. ప్రతి బూత్ కమిటీ నాయకులు బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజలకు వివరించాలని అన్నారు. అలాగే కేంద్రం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఎంతైన ఉందన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బస్వలింగం, బూత్ అధ్యక్షుడు గోపాల్, మండల యువజన అధ్యక్షుడు హన్మంతు, నాయకులు పాల్గొన్నారు.

వేసవి భత్యానికి మంగళం?



బొంపల్లిలో పని ప్రదేశంలో కొలతలు తీసుకుంటున్న ఫిల్డ్ అసిస్టెంట్

'ఉపాధి'లో ఈసారీ చెల్లించని దుస్థితి

- సౌకర్యాల లేమితో ఇబ్బందులు పడుతున్న కూలీలు
- పట్టించుకోని అధికారులు

దోమ: గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద గ్రామీణులకు స్థానికంగా పని కల్పిస్తూ భరోసాను కల్పిస్తోంది. కూలీలకు ప్రతి ఏటా వేసవి భత్యం, ఇతర సౌకర్యాలను ప్రభుత్వం కల్పించేది. కానీ ఈ ఏడాది ప్రశ్నార్థకంగా మారింది. ఈ అంశంపై సంబంధిత అధికారులకు ఎలాంటి స్పష్టత రాకపోవడంతో కూలీలకు వచ్చే వేసవి భత్యానికి మంగళం పాడినట్లేనని తెలుస్తోంది. దీంతో కూలీలు అటు వేసవి భత్యం రాక, ఇటు పని ప్రదేశంలో సౌకర్యాలు లేక ఆవేదన చెందుతున్నారు.

రెండేళ్లుగా కొరవడిన స్పష్టత

జిల్లా వ్యాప్తంగా 566 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 1,81,090 ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉండగా, 2,48,847 మంది కూలీలు నమోదయ్యారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఉపాధి పనులకు 36 వేల మంది కూలీలు హాజరవుతున్నారు. వేసవిలో కూలీలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఫిబ్రవరి నుంచి జూన్ నెల వరకు ఐదు నెలల పాటు రోజు వారి వేతనానికి అదనంగా 25 నుంచి 30 శాతం వేసవి భత్యం చెల్లించేది. కానీ రెండేళ్లుగా ఈ భత్యాన్ని ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో వేసవి భత్యం అందక కూలీలు ఆందోళన చెందుతున్నారు.

సౌకర్యాల లేమితో..

గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో సౌకర్యాలు కరువయ్యాయి. కొన్ని రోజులుగా కూలీలు మండుటెండల్లో పనులు చేస్తూ అల్లాడిపోతున్నారు. పని ప్రదేశంలో కనీసం మంచినీరు, మజ్జిగా, ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు, టెంట్లు, అందుబాటులో లేక పలు చోట్ల కూలీలు అస్వస్థతకు గురవుతున్నారు. గత ప్రభుత్వాలు కూలీలకు టెంట్లు, మంచినీరు, గడ్డపారలు, పారలతో పాటు ఇతర పని ముట్లను అందించేది. తొమ్మిదేళ్లుగా ఎలాంటి పరికరాలను, సౌకర్యాలను ప్రభుత్వం అందించడం లేదు. దీంతో కూలీలు నానా అవస్థలు పడుతున్నారు. తామే స్వయంగా ఇంటి నుంచి పరికరాలను, నీటిని తెచ్చుకొని పనులు చేయాల్సి వస్తుందని ఆయా గ్రామాల కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సౌకర్యాలు కల్పించాలని పలు మార్లు అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడంలేదన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే సౌకర్యాలతోపాటు వేసవి భత్యాన్ని ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

రెండేళ్లుగా నిలిపివేశారు



కూలీలకు వేసవిలో ఫిబ్రవరి నుంచి జూన్ వరకు రోజు వారి వేతనానికి అదనంగా 25 నుంచి 30 శాతం వేసవి భత్యం చెల్లించేవారు. కానీ రెండేళ్లుగా ఎలాంటి వేసవి భత్యాలను ఇవ్వడంలేదు. రోజుకు రూ.150 నుంచి రూ.180 మాత్రమే వస్తున్నాయి. దీంతో తమకు గిట్టుబాటు కావడం లేదు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

– శ్రీశైలం, కూలీ, బొంపల్లి

సౌకర్యాలు లేవు



ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో కనీస సౌకర్యాలను కల్పించడలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గతంలో కూలీలకు గడ్డపారలు, పారతో పాటు ఇతర పరికరాలు ఇచ్చేవారు. కొన్నేళ్లుగా నిలిపివేడంతో ఇబ్బందులకు గురవుతున్నాం. సొంత డబ్బులతో కొనుగోలు చేసి పనులు చేయాల్సి వస్తుంది. మెడికల్ కిట్‌లు కూడా లేవు.

– సోమమ్మ, కూలీ, ఊటుపల్లి

స్పష్టత లేదు



ప్రభుత్వం నుంచి వేసవి భత్యానికి సంబంధించి తమకు ఎలాంటి స్పష్టత లేదు. అందువల్ల కూలీలకు చెల్లించలేకపోతున్నాం. ప్రస్తుతం పని చేస్తున్న కూలీలకు రూ. 272 చెల్లిస్తున్నాం. పని ప్రదేశంలో సౌకర్యాల కల్పనకు పాతవాటిని సర్దుబాటు చేసేలా చూడాలని ఫిల్డ్ అసిస్టెంట్లకు సూచించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే చర్యలు తీసుకుంటాం.

– దస్తయ్య, ఏపీఓ, దోమ



అడ్కిచెర్లలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు

- ప్రతి పంచాయతీకి రూ.50 లక్షలు
- పల్లె పల్లెకు పైలెట్ కార్యక్రమంలో రోహిత్‌రెడ్డి

పెద్దేముల్: గ్రామాలను అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. పల్లె పల్లెకు పైలెట్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని బండమీదిపల్లి, రచ్చకట్టతండా, జైరాంతండా (తట్టెపల్లి), ఓంలానాయక్‌తండా, పాషాపూర్, రాంసింగ్ తండా, అడ్కిచెర్ల, ఉరేంటితండా, బాయిమీది తండాలలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాండూరు ప్రాంత అభివృద్ధికి రూ.134 కోట్ల నిధులు తెచ్చామని, ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఊరికి రూ.50లక్షల ఎస్‌డీఎఫ్ నిధులు మంజురు చేస్తున్నామని తెలిపారు. పల్లెలు పట్టణాలుగా మారాలన్నదే తన లక్ష్యం అన్నారు. రైతులకు ఉచితంగా 24 గంటల కరెంటు ఇస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించాలనే ఉద్దేశంతో గురుకులాలు, మోడల్ స్కూళ్లు ఏర్పాటు చేశారని తెలిపారు. అనంతరం పలు గ్రామాలల్లో సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

సర్పంచ్‌ను తొలగించాలి..

మండల పరిధిలోని ఓంలానాయక్‌తండా సర్పంచ్ రుక్కిబాయి తండాల్లో ఉన్న సమస్యలను పట్టించుకోవడం లేదని, కాలువలు సక్రమంగా లేక రోగాలు బారిన పడుతున్నామని తండా వాసులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సర్పంచ్ రుక్కిబాయిని తొలగించి ఉప సర్పంచ్‌కు చార్జీ ఇవ్వాలని ఎంపీఓ షేక్‌సుస్మాకు ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులతో మాట్లాడుతానన్నారు. అదే విధంగా పాషాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి విధులకు సక్రమంగా రావడం లేదని తండా వాసులు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోర రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్‌చారి, రైతు సేవా సహకార సంఘం చైర్మన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు



క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

కొడంగల్ రూరల్ : ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని అంగడిరాయిచూర్ గేటు సమీపంలో శనివారం చోటుచేసుకొంది. మండల పరిధిలోని టేకుల్‌కోడ్ గ్రామానికి చెందిన నరేష్ తన ఆటోలో ప్యాసింజర్‌తో కొడంగల్ నుంచి టేకుల్‌కోడ్‌కు వెళ్తున్నాడు. అంగడిరాయిచూర్ గేటు సమీపంలోని మూల మలుపులో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొన్నాయి. ఆటోలో ప్రయాణిస్తున్న టేకుల్ గ్రామానికి చెందిన గోపాల్, బైక్‌పై వెళ్తున్న తాయప్పలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరినీ కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రుద్రస్వామిని సబ్‌జైలుకు తరలింపు



నిందితుడు రుద్ర స్వామి

కుల్కచర్ల: వడ్డీ లేకుండా రుణాలంటూ ప్రజలను మోసంచేసిన రుద్రస్వామిని శనివారం సబ్‌జైలుకు తరలించినట్లు ఎస్ఐ గిరి తెలిపారు. కుల్కచర్ల మండల పరిధిలోని చాపలగూడెం గ్రామపంచాయతీలో రుద్ర స్వామిజీపై గతంలో చీటింగ్ కేసు నమోదు చేయగా శనివారం ఆయనను పరిగి సబ్ జైలుకు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఆయన మాట్లాడుతూ ఆర్థికపరమైన నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. హరికృష్ణ అలియాస్ ఉపేందర్ అనే వ్యక్తి జాకారం గ్రామానికి చెందిన యువకుడు. అతను కర్ణాటకలో చిన్న చిన్న తాయిత్తులు మంత్రించడం నేర్చుకుని చాపలగూడెం గ్రామపంచాయతీలో ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. కొన్నిరోజుల అనంతరం రూ.20వేలు ఇస్తే లక్ష రూపాయల రుణం వడ్డీ లేకుండా ఎటువంటి ధరావత్తు లేకుండా డబ్బులు ఇస్తామని 62 మంది నుంచి రూ.24లక్షలు తీసుకున్నాడు. ఆర్థికలావాదేవీలపై కొందరికి అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని చీటింగ్ కేసు నమోదు చేశారు. స్వామి వద్ద రూ.11లక్షలను స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం అతన్ని పరిగి సబ్ జైలుకు తరలించారు. స్వామి వద్ద స్వాధీనం చేసుకున్న నగదును కోర్టులో అప్పగించనున్నామని, బాధితులు కోర్టు నుంచి నగదును పొందవచ్చని ఆయన సూచించారు.

పరిసరాల్లో చెత్త వేస్తే జరిమానా

- తాండూరు మున్సిపల్ కమిషనర్ శంకర్ సింగ్



కాలనీలో చెత్తను తొలగించడాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ శంకర్ సింగ్

తాండూరు టౌన్ : జనావాసాల మధ్య చెత్త వేస్తే జరిమానా తప్పదని మున్సిపల్ కమిషనర్ శంకర్ సింగ్ హెచ్చరించారు. శనివారం ఆయన పట్టణంలోని పలు వార్డుల్లో మార్నింగ్ వాక్ చేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు ప్రజలు, దుకాణదారులు చెత్తను రోడ్డుపై, జనావాసాల మధ్య వేయడాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను పరిసరాల్లో వేయడం సరికాదన్నారు. తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా బుట్టల్లో వేసి పెట్టాలన్నారు. మున్సిపాలిటీకి చెందిన చెత్త తరలించే వాహనం వచ్చినపుడు అందులో వేయాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తే రూ. 500 వరకు జరిమానా విధిస్తామన్నారు. ఈమేరకు శనివారం మున్సిపల్ సిబ్బంది సీసీఐ కాలనీలోని పలు దుకాణాదారులకు జరిమానా విధించారు.

పాతకక్షలతో వ్యక్తిపై దాడి

- నిందితుల అరెస్ట్, రిమాండ్

కొడంగల్ రూరల్ : పాతకక్షలతో ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం రాత్రి మండల పరిధిలోని పాటిమీదిపల్లిలో చోటుచేసుకొంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పోసగాళ్ల అశోక్‌పై అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్, నర్సింహులు పాత కక్షలను మనసులో పెట్టుకొని గొడ్డలి, కర్రలతో దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన అశోక్‌ను వెంటనే కుటుంబసభ్యులు స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అయితే గతంలో నర్సింహులు, శ్రీనివాస్‌లకు సోదరుడైన అరవింద్‌ను హత్య చేసిన కేసులో అశోక్ జైలుకు వెళ్లాడు. ఇటీవల బయటకు రావడంతో అశోక్‌పై దాడికి పాల్పడ్డారు. అశోక్ భార్య సావిత్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నర్సింహులు, శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ రవిగౌడ్ తెలిపారు.


పెళ్లి కావడం లేదని..

- వ్యక్తి ఆత్మహత్య

తాండూరు టౌన్ : పెళ్లి కావడం లేదని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం తాండూరు పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని గ్రీన్ సిటీ కాలనీలో నివాసం ఉంటున్న మహిపాల్ రెడ్డి (36) ప్రైవేటు ఉద్యోగం చేస్తుండేవాడు. వయసు మీరుతున్నా తనకు పెళ్లి కావడం లేదని, పెళ్లి చేయాలంటూ తరచూ ఇంట్లో గొడవ పడేవాడు. ఈమేరకు జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తండ్రి మోహన్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అర్ధరాత్రివేళ ఇంటికి నిప్పు

- దుండగుల దుశ్చర్య



కాలిపోయిన ఇల్లు

పెద్దేముల్: అర్ధరాత్రి వేళ గుర్తుతెలియని దుండగులు ఇంటికి నిప్పంటించారు. ఈ ఘటన బుద్దారం గ్రామంలో చోటుచేసుకుంది. బాధితురాలు బేగరి అంజిలమ్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బేగరి అంజిలమ్మ రెండు రోజుల క్రితం కర్ణాటక రాష్ట్రం కుంచారంలో ఉన్న అక్క ఇంటికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం అర్ధరాత్రి వేళ ఇంట్లో పెద్ద మంటలు వచ్చి నిత్యావసర వస్తువులతో పాటు దుస్తులు, రూ.5వేల నగదు కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. అన్ని బుగ్గి అయ్యాయని తనను ఆదుకోవాలని బాధితురాలు అంజిలమ్మ కోరారు.

మెట్లకుంటకు బస్ నడపండి

తాండూరు డీఎంకు గ్రామస్తుల వినతి

బొంరాస్‌పేట: గ్రామానికి బస్ సౌకర్యం కల్పించాలని మండల పరిధిలోని మెట్లకుంట గ్రామస్తులు తాండూరు డీఎంకు వినతిపత్రం ఇచ్చారు. తాండూరు డిపో నుంచి మండల కేంద్రం బొంరాస్‌పేట మీదుగా మెట్లకుంటకు ఉదయం మధ్యాహ్నం, రాత్రి వరకు బస్ సౌకర్యం ఉండేది. రాత్రికి మెట్లకుంటలోనే నైట్ హాల్ట్ ఉండేది. కరోనా లాక్‌డౌన్ నుంచి ఈ బస్ రద్దయింది. దీంతో నిత్యం ఆయా గ్రామాల ప్రజలతోపాటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బస్సును పునరుద్ధరించాలని కోరుతూ శనివారం గ్రామస్తులు తాండూరు డిపో వద్దకు వెళ్లి వినతిపత్రం సమర్పించారు. బస్సును పునరుద్ధరించి ఇబ్బందులు తీరుస్తామని డీఎం తెలిపినట్లు చెప్పారు.

తగ్గిన పసుపు ధర

- రైతన్న దిగాలు
- ధారూరులో క్వింటాలుకు రూ.4.400



మార్కెట్‌లోని ఓ దుకాణంలో పసుపు బస్తాలు

ధారూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్లో శనివారం పసుపు ధర క్వింటాలుకు రూ. 400 నుంచి రూ.900 వరకు ధర తగ్గడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఒక్కో మార్కెట్లో ఒక్కో ధర పలికితే ఎలా అని రైతులు ప్రశ్నించారు. వికారాబాద్ మార్కెట్లో క్వింటాలుకు రూ.5 వేల పైన ధర పలుకగా ధారూరులో మాత్రం రూ.4,400 వరకు ధర పలికింది. దీంతో రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విక్రయిస్తే క్వింటాలుకు ఏకంగా దాదాపు రూ.900 వరకు నష్టపోతామని భావించిన రైతులు బీట్లు జరిగినా అమ్మడానికి నిరాకరించారు. చేసేది లేక పసుపు బస్తాలను అడ్తిదారుల దుకాణాల్లో నిల్వ చేశారు. కందులు మాత్రం 334 బస్తాలు రాగా క్వింటాలుకు రూ.8 వేల నుంచి రూ.8,400 వరకు అమ్మకాలు జరిగాయి. అలాగే మొక్కజొన్న 456 సంచులు రాగా క్వింటాలుకు రూ.1,900 నుంచి రూ. 1,930 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు.

చచ్చిందెవరో.. చంపిందెవరో!

- మిస్టరీగా మారుతున్నహత్య కేసులు
- అడ్డాగా మారిన నగర శివారు ప్రాంతాలు
- కేసులు ఛేదించలేక తలలు పట్టుకుంటున్న పోలీసులు
- నిఘాను ముమ్మరం చేయాలంటున్న స్థానికులు



జాగిలంతో పోలీసుల గాలింపు (ఫైల్)

పహాడీషరీఫ్: నగర శివారు ప్రాంతంగా ఉన్న పహాడీ షరీఫ్ పరిసరాలు హత్యలకు నిలయాలుగా మారాయి. రోజూ ఎక్కడో ఒక చోట గుర్తు తెలియని వ్యక్తుల శవాలు లభ్యమవుతుండటమే ఇందుకు కారణం. ఇక్కడే హత్య చేస్తున్నారా? లేక ఎక్కడో హత్య చేసి అర్ధరాత్రి వేళ మృతదేహాలను ఇక్కడ పడేస్తున్నారా అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఉదయాన్నే ఆ మృతదేహాలను చూస్తున్న పోలీసులు చచ్చిందెవరో....చంపిందెవరో తేల్చడానికి తలలు పట్టుకోవాల్సి వస్తోంది. ముఖ్యంగా జల్‌పల్లి పెద్ద చెరువు, తుక్కుగూడ హైవే పరిసరాలలోనే మృతదేహాలు లభ్యమవుతున్నాయి. కొన్ని సార్లు ఇతర ప్రాంతాలలో హత్య చేసి ఇక్కడ పడేస్తుండగా.. మరి కొన్ని సార్లు ఇక్కడే మద్యం పార్టీలు చేసుకుంటూ పథకంలో భాగంగా హత మారుస్తున్నారు. ఇక్కడ లభ్యమవుతున్న మృతదేహాలను చూసి స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. సీసీ కెమెరాలను పెద్ద మొత్తంలో ఏర్పాటు చేయడంతో పాటు రాత్రి పూట గస్తీని ముమ్మరం చేయాలని కోరుతున్నారు.

అధిక శాతం ఉత్తర భారతీయులే..

ఉత్తరప్రదేశ్, బీహార్, ఒడిశా తదితర రాష్ట్రాలకు చెందిన ప్రజలు జీవనోపాధి నిమిత్తం నగరానికి వచ్చే వారు అధిక సంఖ్యలో ఉంటారు. వారంతా ప్రస్తుతం పహాడీషరీఫ్ ఠాణా పరిసర ఠాణాలలో అధికంగా నివాసం ఉంటున్నారు. ఇలాంటి వారు హత్యకు గురవుతుండడం.. ఒక్కోసారి వీరే హత్యలు చేసి తమ స్వరాష్ట్రాలకు పారిపోతుండడంతో కేసుల దర్యాప్తు ముందుకు సాగని పరిస్థితి నెలకొంటుంది. వీరితో పాటు పాతబస్తీ నుంచి వచ్చి కూడా ఇక్కడ హత్యలు చేసిన ఘటనలు ఎన్నో వెలుగుచూశాయి. పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేసి నేరాల నివారణకు కృషి చేస్తామని పోలీసులు పేర్కొంటున్నారు. ఎక్కడో హత్య చేసి పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిసరాలలో పడేసిన మృతదేహాలలో చాలా వరకు పోలీసులు కేసులను ఛేదించినప్పటికీ.. ఇంకొన్ని కేసులలో వివరాలు ఎటూ తేలలేని పరిస్థితి నెలకొంది.

తేలని హత్య కేసుల్లో మచ్చుకు కొన్ని

- తుక్కుగూడ హైవే రోడ్డులో సర్దార్‌నగర్ గేట్ సమీపంలో ఈ నెల 12న గుర్తు తెలియని మహిళను దారుణంగా హత్య చేసి సంచిలో కుక్కి పడేసి పోయారు.
- 2021 ఆగస్టు 3న జల్‌పల్లి కార్గో రోడ్డు పక్కన గుర్తు తెలియని యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. రెండేళ్లు కావస్తున్నా మృతుడు ఎవరో...హత్య చేసిందెవరో కూడా తెలియరాలేదు.
- మామిడిపల్లిలోని ఎస్ఎస్‌పీడీఎల్ రియల్ ఎస్టేట్ వెంచర్‌లో ఉన్న గెస్ట్ హౌస్‌లో 2016 జూన్ 25న ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రమాకాంత్ పాండే (40) హత్యకు గురయ్యాడు. వెంచర్‌లోకి తాను తీసుకొచ్చిన ఓ యువతీ, యువకుడే ఈ దారుణానికి ఒడిగట్టాడని పోలీసులు భావించినప్పటికీ వారు ఇంకా దొరకలేదు. వీరి ఆచూకీ కోసం పోలీసులు బీహార్ వెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.
- 2016 ఆగస్టు 13న పహాడీషరీఫ్–మామిడిపల్లి రహదారి పక్కన ఉన్న ఓ ప్రైవేట్ సంస్థ ఆవరణలో 25 ఏళ్ల గుర్తు తెలియని యువకుడిపై పెట్రోల్ పోసి తగులబెట్టి హత్య చేశారు. ఈ కేసులో మృతుడు ఎవరో తేలలేదు.
- 2020 ఏప్రిల్ నెలలో ఇదే సంస్థ ప్రాంగణంలో గుర్తు తెలియని మహిళ శవం లభ్యమయ్యింది. ఈ కేసులోనూ ఎలాంటి పురోగతి లేకుండా పోయింది.
- 2014 నవంబర్ 15న ఎర్రకుంట అలీ నగర్‌లో హత్యకు గురైన యువతి వివరాలు కూడా తెలియరాలేదు.